

# శేషేంద్ర ప్రజ

మోటమర్రి బేబీకళ్యాణి, బెండమూర్లంక

ప్రశ్న: 'ముత్యాలముగ్గు' చిత్రంలోని మీ పాట 'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది'. ఈ పాట వింటూంటే నన్ను నేనే మైమరచిపోతాను. ఇంత మంచి పాట రాయగలిగిన మీరు మళ్ళీ సినిమాలకి రాయటంలేదు. కారణం ఏమిటి? నిజమైన కవిత్వం ఎలా వుండాలి? కవితకు, గేయానికీ తేడా ఏమిటి?

తెలుగు దేశ వాతావరణం ఏమిటో మీకు తెలీదా? ఎవ్వెవ్వరూ సినిమాకి పాట రాయమని అడగలేదు, నేను రాయలేదు!

కవిత్వానికి ఉదాహరణ మాత్రమే ఇవ్వగలను. చూడండి:- ''వేళ్ళు కాళ్ళయి నడిచే చెట్టుమనిషి! చెట్టుగా ఉంటే ఏడాది కొక వసంతమన్నా దక్కేది! మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను!'' ''జీవించ డంలోనే జీవితమంతా ఖర్చుచేసి అలసిపోయాడు! అతడు వర్తమానంలో నుంచి వర్తితలోకి వలస పోయాడు!''-

కవిత కవిత. గేయం కవిత చెప్పబడే అనేక రూపాల్లో ఒక రూపం.

అన్నం నాగార్జునరావు, కావలి

ప్రశ్న: రచయితగా జీవించిన కవిశ్రీ గుడిపాటి వెంకటచలం పై మీ అభిప్రాయం ఏమిటి? ఆధునిక తెలుగు కవులలో మీరు మెచ్చేది ఎవర్ని?

శ్రీ గుడిపాటి వెంకటచలం మనలో ఒక మహాపురుషుడు. సూర్య తేజస్సు లాంటి ప్రతిభ, పర్వతం లాంటి ధైర్యము, నిర్మలాకాశం లాంటి నీతి- ఈ మూడు ద్రవ్యాలతో చేసిన మూర్తి ఆయనది. ఆయన భావాలతో ఏకీభవించని వాళ్ళు కూడా ఆయన జీవితం ఒక నైతిక ఝంఝామారుతం అని అంగీకరిస్తారు.

ఆధునిక కవుల్లో నాకు అందరూ కొంత కొంత నచ్చుతారు; నేను మెచ్చుకునేలా చేస్తారు.

మహబూబ్ సుభాని, కల్లూరుమండలం

ప్రశ్న: ఆంధ్ర సాహిత్యలోకానికి 'విప్లవ కవిత్వం' అంటే 'శ్రీశ్రీ'యే స్ఫురిస్తాడు. కాని 'భావకవిత్వం' నుండి విడివడి 'స్వచ్ఛందతావాది'గా స్వేచ్ఛగా 'మహాప్రస్థానం' చేసిన శ్రీశ్రీ కవిత్వం కొంతకాలానికి 'అభ్యుదయ కవిత్వం'గానే ముద్రపడింది. పైగా 'విప్లవం' అనే మాట ఎక్కడా కనిపించదు. 1972 ఆ ప్రాంతంలో వచ్చిన 'శేషేంద్రశర్మ' అనగా మీ కవిత్వమే 'విప్లవ కవిత్వ భాష'కు నాంది అయింది కదా! మీకా ప్రతిష్ఠ ఎందుకు దక్కలేదు?

దక్కలేదని మీ అభిప్రాయము; దక్కిందని నా అభిప్రాయము.

బి.రాజయ్య, నల్లగొండ

ప్రశ్న: గొప్ప విప్లవ కవిత్వం వ్రాస్తున్న మీరు వి.ర.సం.లో సభ్యులు కాకపోవడానికి కారణమేమిటి?

గొప్ప విప్లవ కవిత్వం రాస్తే విరసంలో సభ్యులు కావాలన్న నిర్బంధం ఎక్కడా లేదు- నన్ను చేర్చుకుంటా రేమో ముందు మీరు కనుక్కోండి; తర్వాత సంగతి ఆలోచిద్దాం.

పి.అపర్ణాశర్మ, హైదరాబాద్

ప్రశ్న: మీ సాహిత్యంమీద ఏ యూనివర్సిటీలోనైనా ఎవరైనా పరిశోధన చేశారా? లేదా చేస్తున్నారా? మీకు తెలిసిన వివరాలు తెలపండి.

హైదరాబాదు యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, బెంగుళూరు యూనివర్సిటీల్లో చేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీలో కూడా చేశారని ఎవరో అన్నారు.

మక్కువ ప్రసాదరావు, మక్కువ

ప్రశ్న: మీ దృష్టిలో సాహిత్యాభిమాని గొప్పవాడా? లేక సంగీతాభిమాని గొప్పవాడా?

నా దృష్టితో ఇద్దరూ గొప్పవారే, ఉభయ కళల తత్త్వం తెలిసిన వివేకవంతులు రెండూ సమానమే అన్నారు గనక. ఆత్మసాఫల్యానికి రెండు కళలూ సమాన మార్గాలు. వీణా పుస్తకపాణి అన్నారు గదా సరస్వతిని!

సూధ వల్లభ్ కృష్ణ, ఖరగ్‌పూర్

ప్రశ్న: ఉత్తమ కవిత్వం అంటే ఎలా వుండాలి? మీరు ఎక్కువగా ఎటువంటి కవిత్వాన్ని ఇష్టపడతారు?

అది ముందు కవిత్వంగా ఉండాలి. శ్రోత వింటే చమత్కృతుడయ్యేలా ఉండాలి- ఆ పంక్తిగానీ, ఆ భాషగానీ కవిత్వంగా ఉండడం కవిత్వంలో సాధారణ విషయం. కవిత్వం ఉత్తమ కవిత్వం కావడానికి ఉత్తమ విషయం చెప్పబడాలి. ఉదాహరణ ''హాయ్ ఓ సబ్జా చమన్ కెజిసె! సాయె గుల్‌మె నీంద్ ఆయీహై'' అరె ఆ తోట (ఎంత ఆశ్చర్యం ఆనందం) గులాబీ నీడలో, దానికి నిద్ర వచ్చింది!- ఇది సాధారణ కవిత్వం. ''దిల్ గయా రౌనఖే హయాత్ గయీ! గమ్ గయా సారీ కాయినాత్ గయీ!''- హృదయం పోయిందా, జీవన శోభే పోయింది; బాధ పోయిందా, సమస్త సృష్టే పోయింది- ఇది వట్టి కవిత్వం కాదు, ఉత్తమ కవిత్వం.

## కాలమ్ దాటని కథ

### బతుకుతెరువు

ఎండ మండిపోతూ వుంది. నాలుక పిడ చకట్టుపోతూంది రామయ్యకు. అడుగుతీసి అడుగువేయడం కష్టంగా వుంది. చదువుకొన్న వాళ్ళకే ఉద్యోగాలు దొరకని ఈ రోజుల్లో పొట్టపొడిస్తే అక్షరం ముక్క కనిపించని తనకి ఉద్యోగం ఎవరిస్తారు? ఉద్యోగం మాట దేవుడెరుగు-ముందు మంచినీళ్లెవరిస్తారు?

దూరంగా ఓ కిళ్ళీకొట్టు కనిపించింది. ప్రాణం లేచి వచ్చింది. కాళ్లీడ్చుకొంటూ ఆ బడ్డీ దాకా వెళ్ళాడు రామయ్య. ''ఐస్‌సోడా, నిమ్మకాయసోడా, కూల్ డ్రింక్ — ఏది కావాలి?'' అడిగాడు అంగడి రంగయ్య. ''అయ్యా దప్పికౌతూంది. కాసిని మంచినీళ్లిచ్చి పుణ్యం కట్టుకో బాబు!'' అన్నాడు రామయ్య. అంగడివాడు నవ్వాడు. ''పరాయి ఊరు వాడివిలా వున్నావ్. ఈ ఊరు సంగతి నీకు తెలియదు. జనం నీళ్ళు లేక చస్తున్నారు. పైగా నేను సోడా బడ్డీవాణ్ణి. అడిగిన వాడికల్లా మంచి నీళ్లిస్తే నా సోడా ఎవడు కొంటాడయ్యా!'' అన్నాడు రంగయ్య.

''నీవు ఇవ్వవు సరికదా చుట్టుపక్కల వాళ్లెవరూ మంచి నీళ్లివ్వరంటావా? అంత మంచి ఊరా బాబూ! ఐనా బతకాలిగా! అడిగి చూస్తా'' అంటూ రామయ్య పోయి ఓ యింటి ముందాగాడు. ''అమ్మా! ఎండ మండిపోతూంది. పరాయి ఊరివాణ్ణి. ప్రాణం కడబడుతూంది. మంచినీళ్ళు పోసి ప్రాణం నిలుపు తల్లీ!'' అని అరిచాడు.

ఓ ఇల్లాలు బైటికి వచ్చింది. ''నీవు చెప్పినవన్నీ నిజమే కాని బాబూ! పొద్దున్ననగా మంచి నీళ్ళకెళ్ళిన మా వాళ్లింకా రాలేదు. ఆ కోసెడు దూరాన వున్న చెంప దగ్గర రేషన్‌షాపు సెనగనూనె క్యూని మించి వుంటారు జనం. రేషన్ షాపు సెనగ నూనెలాగా చెలమలో నీళ్ళు యిండుకొన్నాయో ఏమో ఖర్మ! ఇంట్లో వున్న కాసిని నీళ్లు మా పసికందులకు చాలవు. నీవే చెప్పు. అతిథివి, దేవుడులాంటి వాడివి. కన్న బిడ్డల్ని కాదని నీకు పోయమంటావా? కాలంనాడు కన్నబిడ్డల్ని, పెళ్ళాన్ని పస్తు పడుకోబెట్టి తాను కూడా తినకుండా సిద్ధాన్నాన్ని అతిథికి పెట్టాడని పురాణం శాస్త్రుల్లు చెప్పేవాడు. ఇప్పుడా పురాణాలు చెప్పటంలేదు. ఇది పురాణ కాలమూ కాదు. కాబట్టి ఓ అతిథి దేవుడా! నీకు నమస్కారం'' అందా ఇల్లాలు.

'అంగడి రామయ్య చెప్పింది, ఈ అమ్మ చెప్పింది అక్షర సత్యం! బతికితే ఇక్కడే బతకాలి' అని రామయ్య అనుకుంటూండగా కుండ బరువుతో దూరాన ఆసామి కనిపించాడు. గుర్తుపట్టి ఎదురుపోయి సాయం చేశాడు రామయ్య.

మరునాటి నుంచి రామయ్య మంచినీళ్ల కావడితో ప్రత్యక్షం. అంగడి రంగయ్యకే కాదు చాలా మందికి మంచి నీళ్ళు సరఫరా చేస్తాడు రామయ్య. అతని ఇప్పటి పేరు రామయ్య కాదు గంగాధరం. ముద్దుగా ధరమయ్య అంటారు.

— చిట్టా దామోదర శాస్త్రి